సాక్షి
వైఎస్సార్ జిల్లా
సోమవారం । 28 । ఆగస్టు । 2023



బాధ్యత మరచి ఆరోపణలా?

ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో బాధ్యత లేకుండా వ్యవహరించిన టీడీపీకి మరొకరిపై ఆరోపణలు చేసే హక్కు లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. -8లో



చిరుత సంచరిస్తోందని ఆందోళన

రాజుపాళెం మండలం దద్దనాలకు వెళ్లే రహదారి పక్కన పంట పొలాల్లో చిరుతపులి సంచరిస్తోందని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.7/27.5

వాతావరణం

జిల్లాలో ఆదివారం 27.5 – 35.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

గండి అంజన్నకు రూ.16,36 లక్షల ఆదాయం

చక్రాయపేట: శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా రెండో శనివారం గండి వీరాంజనేయస్వామికి వివిధ రూపాల్లో రు.16,36,920లు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఆలవల పాటి ముకుందరెడ్డి తెలిపారు. వివిధ రకాల సేవా టికెట్ల రూపంలో రు.4,33,000, లడ్డూ ప్రసాద విక్రయాల ద్వారా రు.8,25,000, తాత్కాలిక హుండీల ద్వారా రు.1,67,800, శాశ్వత నిత్యాన్నదానానికి రు.2,11,120లు ఆదాయం వచ్చిందన్నారు. అలాగే మొదటి శనివారం వివిధ సేవా టికెట్ల రూపంలో రు.3,49,485,లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రు.5,68,500, తాత్కాలిక హుండీల ద్వారా రు.46,050లు ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

రేపు పీడీలు, పీఈటీలకు సమావేశం

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద పనిచేస్తున్న పీడీలు, పీఈటీలకు 29వ తేదీ ఉదయం 10 గంటలకు కడపలోని జెడ్పీ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించనున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు హాజరుకావాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు క్రీడా ప్రతిభా అవార్డు ప్రధానోత్సవ ఉంటుందని,అనంతరం వ్యాయామ ఉపాధ్యాయులకు లెషన్‌ప్లాన్ డెయిరీ, ఖేలో ఇండియా అసెస్‌మెంట్ టెస్ట్ ఏ విధంగా నిర్వహించాలనే అంశంపై నిష్టాతులైన వ్యాయామ ఉపాధ్యాయులు సలహాలు ఇస్తారని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తప్పక హాజరుకావాలని తెలిపారు.

రేపు సిక్కీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

కడప కార్పొరేషన్: ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మానస ఇన్ హోటల్‌లో హెచ్‌పీ, భారత్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కో ఆర్డినేటర్లు సి. బాబు, రామక్రిష్ణలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సిక్కీ నేషనల్ చైర్మన్ ఏ. డేవిడ్ బెర్నార్డ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఓసీఎల్ ఎస్ఓ శ్రీనివాస్, బీపీసీఎల్ ఎస్ఓ ధనుష్, హెచ్‌పీసీఎల్ ఆర్ఎం నాగసతీష్, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్, ఎస్‌బీఐ ఆర్ఎం నారాయణరావు, డీసీసీబీ సీఈఓ కె. రాజేంద్రకుమార్, పరిశ్రమల శాఖ జేడీ విజయలక్ష్మిలు పాల్గొంటారని తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

29న తెలుగు ప్రతిభా పోటీలు

కడప ఎడ్యుకేషన్: తెలుగు భాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ జిల్లాశాఖ, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో 29వ తేదీ ఉదయం 10 గంటలకు కడపలోని విద్యావనరుల కేంద్రంలో జిల్లాస్థాయి తెలుగు ప్రతిభా పోటీలను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆర్‌యూపీపీ అధ్యక్షుడు ఎఫ్ఎంఎస్ ఖాదర్, గౌరవాధ్యక్షుడు నరసింహారెడ్డి ఆదివారం తెలిపారు. ఇందుకు సంబంధించి 22వ తేదీన పాఠశాల స్థాయిలో పోటీలు జరిపి ఎంపికైన వారికి 24వ తేదీన మండలస్థాయి పోటీలు నిర్వహించామన్నారు. ఇందులో ప్రథమ, ద్వితీయస్థానాల్లో గెలుపొందిన వారికి 26వ తేదీన డివిజన్‌స్థాయిలో, ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి 29వ తేదీన జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను అందజేస్తామని తెలిపారు.

ఫొటోగ్రఫీలో ప్రతిభ



విద్యార్థి విల్సన్‌ను అభినందిస్తున్న వీసీ ఆచార్య అంజనేయప్రసాద్

ఏఎఫ్‌యూ: ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో జూన్ నెలలో నిర్వహించిన జాతీయస్థాయి త్రైమాసిక ఫొటోగ్రఫీ కాంపిటీషన్‌లో కడపలోని డా. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ ఫొటోగ్రఫీ విద్యార్థి జి. విల్సన్ ప్రతిభ కనబరిచాడు. ఈ కాంపిటీషన్‌లో ఫెస్టివల్ థీమ్ మోనోక్రోమ్ విభాగంలో ఈయన తీసిన ఛాయాచిత్రం భండారా ఫెస్టివల్ (జెజూరి యాత్ర, మహారాష్ట్ర)కు రెండో ఉత్తమ బహుమతి లభించింది. ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 77 సంవత్సరాలు అయిన సందర్భంగా జాతీయ ఫొటో కాంపిటీషన్ –2023లో భాగంగా నిర్వహించిన ఈ కాంపిటీషన్‌లో ఈయన తీసిన చిత్రానికి రెండో బహుమతి లభించింది. విద్యార్థికి వీసీ ఆచార్య బి. అంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

దీవెన..భవితకు నిచ్చెన

చదువుకు పేదరికం అడ్డుకానే కాదు. పట్టుదలతో చదవాలే గాని ఉన్నత శిఖరాలే తల వంచేస్తాయి. విద్య అనే ఆయుధం విజ్ఞానానికి పదును పెడుతుంది. ఇది గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల విద్యకు పెద్ద పీట వేశారు. ప్రతిష్టాత్మకంగా జగనన్న విద్యా దీవెనను అమలు చేస్తున్నారు. పేద విద్యార్థులు నిశ్చింతగా చదువుకోవడానికి ఠంఛన్‌గా కాలేజీ ఫీజులను తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. అందులో భాగంగా నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లా నగరిలో జరిగే బహిరంగ సభలో మూడో విడత నిధులను విడుదల చేస్తున్నారు.



- నేడు జగనన్న విద్యాదీవెన మూడో విడత నిధులు విడుదల
- 42,989 మంది విద్యార్థులకు ప్రయోజనం
- తల్లుల ఖాతాల్లో జమకానున్న రూ 31.67 కోట్లు

కడప రూరల్: పేదల విద్యా సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అందులో భాగంగా జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను ప్రవేశపెట్టారు. ఫలితంగా పేద విద్యార్థులు నిశ్చింతగా చదువును సాగిస్తున్నారు. జగనన్న విద్యా దీవెన కింద ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర విద్యా కోర్సులను అభ్యసించే పేద విద్యార్థులకు పూర్తి ఫీజులను ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ నిధులను మూడు నెలలకు ఒక సారి చొప్పున ఒక ఏడాదిలో నాలుగు విడతలుగా ఫీజులను మంజూరు చేస్తోంది. అంటే ప్రభుత్వం ఈ కాలేజీ ఫీజులను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తుంది. తల్లులు అ డబ్బును తీసుకొని కాలేజీల్లో చెల్లించాల్సి ఉంటుంది. కాగా జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, ముస్లిం, క్రిస్టియన్

జిల్లాలో జగనన్న విద్యా దీవెన మూడవ విడత నిధుల చెల్లింపుల వివరాలు

వర్గం	విద్యార్థులు	నిధుల విడుదల (రూ)
ఎస్సీ	7,979	5,67,23,502
ఎస్టీ	698	49,78,419
బీసీ	15,932	11,06,58,835
ఈబీసీ	7,394	6,87,81,020
కాపు	5,527	4,05,83,204
ముస్లిం	5,346	3,41,93,961
క్రిస్టియన్	113	8,09,180
మొత్తం	42,989	31,67,28,121

వర్గాలకు చెందిన మొత్తం 42,989 మంది విద్యార్థులు 300 కాలేజీల్లో చదువుకొంటున్నారు. వీరికి మూడో విడత కింద విద్యార్థుల తల్లుల ఖాతాలకు మొత్తం రూ 31,67,28,121 జమ కానుంది.

గతమంతా అస్తవ్యస్తం....

గత తెలుగుదేశం పార్టీ పాలనలో ఫీజుల పథకం గాలిలో దీపంలా మారింది. నాటి ప్రభుత్వం సక్రమంగా కాలేజీలకు ఫీజులను చెల్లించేది కాదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురయ్యేవారు. పాపం..విద్యార్థులకు పరీక్షల సమయంలో ఫీజుల కష్టాలు వెంటాడేవి. కాలేజీ యాజమాన్యాలు ఫీజుల చెల్లిస్తేగాని హాల్ టికెట్స్ ఇచ్చేవారు కాదు. ఇలా పేద విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

ఇప్పుడు చిరునవ్వులతో చదువులు...

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక విద్యా రంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేశారు. దేశం యావత్తు అబ్బుర పడేలా విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. ఫలితంగా విద్యార్థులు నిశ్చింతగా ఉంటున్నారు. చిరునవ్వులతో చదువులు సాగిస్తున్నారు. సరస్వతీ పుత్రులుగా మారి..విద్యా వేత్తలుగా ఎదుగుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా రంగంలో అమలు చేస్తున్న పథకాల పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.



తల్లులు బిడ్డల చదువులు..సౌకర్యాల గురించి తెలుసుకోవాలి



ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన కింద మూడో విడతగా విద్యార్థుల కాలేజీ ఫీజులను తల్లుల ఖాతాలకు జమ చేస్తుంది. ఈ డబ్బును ఒక వారంలోపు కాలేజీలో చెల్లించాలి. అదే సందర్భంగా తమ బిడ్డ చదువులు..కాలేజీలో ఉండే సౌకర్యాల గురించి ఆరా తీయాలి. జవాబు దారి కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాలేజీ ఫీజులను తల్లుల ఖాతాలకు జమ చేస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న పోత్సాహాన్ని అందిపుచ్చుకొని విద్యార్థులు విద్యా వేత్తలుగా ఎదగాలి.

– సరస్వతి,
డిప్యూటీ డైరెక్టర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ

జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్: జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం తెల్లవారుజామున వర్షం కురిసింది. కమలాపురం మండలంలో అత్యధికంగా 14.8 మిల్లీ మీటర్లు, కడపలో 1 మిల్లీమీటర్ల అత్యల్ప వర్షం కురిసింది.కలసపాడు మండలంలో 12.2, కాశినాయన మండలంలో 6, వల్లూరు మండలంలో 2.4, పోరుమామిళ్లలో 3.2, బిమఠంలో 1.2 , బికోడూరు, కడపల్లో 1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

శ్రీరెడ్డెమ్మతల్లికి బంగారు, వెండివస్తువుల వితరణ



వెండివస్తువులు బహూకరిస్తున్న పులివెందుల వాసులు

గుర్రంకొండ: అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మ తల్లి ఆలయానికి భక్తులు బంగారు నెక్లెస్, 3కేజీల వెండివస్తువులు విరాళంగా ఇచ్చారు. జిల్లాలోని ఓబుళంవారిపల్లె మండలం మంగంపేట గ్రామానికి చెందిన వెంకటకిషోర్‌రెడ్డి, దేవిక, వెంకటసుబ్బారెడ్డి, మాలతి దంపతులు రూ.1,62,000 విలువచేసే బంగారు నెక్లెస్‌ను అమ్మవారికి బహూకరించారు. వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణానికి చెందిన రెడ్డిభాన్వీఇషిక, ప్రియాంక, కిరణ్ దంపతులు 3కేజీల బరువు గల పంచహారతులు,హారతి పళ్లెం, దక్షిణావృతశంఖం,తీర్థంపాత్ర ఉద్దరిణీ అందజేశారు. ఆదివారం ఆలయానికి చేరుకున్న వీరికి ఈవోమంజుల ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు, ప్రత్యేకపూజలు,అర్చనలు జరిపించి అమ్మవారి శేషవస్త్రాన్ని దాతలకు అందజేశారు.

చిరంజీవ.. సుఖీభవ



కడపలో అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



పులివెందులలో దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్ మనోహర్ రెడ్డి

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పలుచోట్ల అన్నదానం చేశారు. చీరెలు పంపిణీ చేశారు.రోగులకు బ్రెడ్లు అందజేశారు. సాయం అందుకున్న వారంతా చిరంజీవ..సుఖీభవ అంటూ ఆశీర్వదించారు.సేవా కార్యక్రమాల్లో భాగంగా కడపలో డిప్యూటీ సీఎం అన్నదానం చేశారు. పులివెందులలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, చైర్మన్ వరప్రసాద్‌లు వృద్ధులు,వికలాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. –సాక్షి నెట్‌వర్క్

పుట్టా డీలా!

- సర్వేలతో సమాలోచనలో పడిన అధినేత చంద్రబాబు
- ఎన్నికల బరి నుంచి ఇన్‌చార్జిలను తప్పించే పనిలో నిమగ్నం
- మైదుకూరు, ప్రొద్దుటూరు, కమలాపురంపై ప్రత్యేక దృష్టి
- అధిష్టానం తీరుపై పుట్టా సుధాకర్ యాదవ్ కినుక
- వ్యూహాత్మకంగా పావులు కదపుతున్న మాజీ ఎమ్మెల్యే డీఎల్

సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం జెండా మోసిన నియోజకవర్గ ఇన్‌చార్జిలకు అధిష్టానం మొండిచేయి చూపనుందా? సర్వేల పేరుతో పక్కన పెడుతున్నారా? అనూహ్యంగా ఆయా మాజీ నేతలను తెరపైకి తెస్తున్నారా.. అంటే..రాజకీయ విశ్లేషకులు ఔనని సమాధానమిస్తున్నారు. ఆ మేరకే జిల్లాలో మూడు నియోజకవర్గాలల్లో ప్రధానంగా మార్పులు చేర్పులు చేయాలనే దిశగా సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో ప్రధానంగా మైదుకూరు నియోజకవర్గం ఒక్కటి. ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ స్థానంలో మాజీ ఎమ్మెల్యే డీఎల్ రవీంద్రారెడ్డిని తెరపైకి తెస్తున్నట్లు సమాచారం.

2014, 19 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పుట్టా సుధాకర్‌యాదవ్ మైదుకూరు నుంచి తలపడి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శెట్టిపల్లె రఘురామిరెడ్డి చేతిలో ఓటమి చెందారు. వరుసగా ఓటమి మూటగట్టుకున్న సుధాకర్‌యాదవ్ మరోమారు 2024లో పోటీలో తలపడి అదృష్టం పరీక్షించుకోవాలని తలచారు. కాగా టీడీపీ అధిష్టానం చేయించుకున్న సర్వేలు పుట్టాకు అడ్డంకిగా మారినట్లు తెలుస్తోంది. మైదుకూరులో టీడీపీ పట్ల అంతంత మాత్రమే ఆదరణ లభించగా, వ్యక్తిగత సర్వేల్లో పుట్టా సుధాకర్ బాగా వెనుకంజలో ఉన్నట్లు సమాచారం. ఈనేపథ్యంలో పుట్టా స్థానంలో మాజీ ఎమ్మెల్యే డీఎల్‌ను తీసుకొస్తే పోటీ ఇవ్వగలమనే అంచనాకు టీడీపీ అధినేత వచ్చినట్లు తెలుస్తోంది. ఆమేరకు సమాలోచనలో పడినట్లు సమాచారం.



పుట్టా సుధాకర్ యాదవ్

డీఎల్‌తో చర్చించేందుకు సన్నాహాలు....

టీడీపీ నిర్వహించిన సర్వేల ఆధారంగా మాజీ ఎమ్మెల్యే డీఎల్ రవీంద్రారెడ్డితో చర్చించేందుకు ఆ పార్టీ సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఆ బాధ్యతలను హైదరాబాద్ పార్టీ కార్యాలయం కేంద్రంగా ఇద్దరు నేతలకు అప్పగించినట్లు తెలుస్తోంది. ముందుగా ఆ ఇద్దరు నేతలు మైదుకూరుపై కూలంకషంగా చర్చించిన తర్వాత అధినేత చంద్రబాబుతో మంతనాలు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఆ మేరకు తొలిదశ చర్చలు చేపట్టినట్లు తెలుస్తోంది. సంపూర్ణంగా మరోమారు వారంలోపు చర్చించిన పిదప అధినేతతో అన్ని విషయాలు తెలియజేసిన తర్వాత మాజీ ఎమ్మెల్యే డీఎల్‌తో ముఖాముఖీ నిర్వహించినున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పుట్టా సుధాకర్‌యాదవ్ కినుక...

అధిష్టానం నుంచి సర్వే సంకేతాలు అందుకున్న పుట్టా సుధాకర్‌యాదవ్ డైలామాలో పడ్డారు. చంద్రబాబు, నారా లోకేష్ లాంటి ప్రధాన నాయకుల పర్యటనలో మినహా తర్వాత రోజులల్లో మైదుకూరులో కన్పించడం లేదు. పక్షం రోజులకు ఓమారు అలా వచ్చి వెళ్తున్నారు. నారాలోకేష్ యువగళం పర్యటన, చంద్రబాబు ప్రాజెక్టుల పరిశీలన కార్యక్రమాలల్లో మాత్రమే నియోజకవర్గంలో పుట్టా కన్పించడం విశేషం. మైదుకూరు టీడీపీ టికెట్‌పై స్పష్టత లేకపోవడం, అధిష్టానం ప్రత్యామ్నాయ చూపులను పసిగట్టిన పుట్టా సన్నిహితుల వద్ద టీడీపీపై మండిపడుతోన్నట్లు తెలుస్తోంది.

ప్రొద్దుటూరు, కమలాపురంలలో సైతం....



ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



పుత్తా నరసింహారెడ్డి

టీడీపీ అధిష్టానం ప్రొద్దుటూరు ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఇప్పటికే స్పష్టత ఇచ్చినట్లు సమాచారం. పార్టీ అభ్యర్థి ఎవరైనా సరే, విజయం కోసం కృషి చేయాలని, తర్వాత మీ భవిష్యత్ నాదేనని చంద్రబాబు తేల్చి చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ తర్వాతే మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రొద్దుటూరులో వ్యూహాత్మక అడుగులు వేస్తున్నట్లు సమాచారం. కమలాపురంలో టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డిది సైతం అదే పరిస్థితి. టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలనే దిశగా సూచనలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈమారు కఠిన నిర్ణయాలు తప్పవని హెచ్చరికలు పంపినట్లు సమాచారం. రెండు దశాబ్దాలుగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్న ఓ మాజీ నేత పట్ల టీడీపీ అధినేత ఆకర్షితులవుతున్నట్లు రాజకీయ పరిశీలకులు వివరిస్తున్నారు.

సేవకు స్ఫూర్తి.. ఆకేపాటి



జెడ్పీ చైర్మన్ ఆకేపాటితో కలిసి ఆపరేషన్ నిర్వహించే బస్సును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి


- డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
- ఆకేపాటి ఎస్టేట్‌లో ఉచిత కంటి పొర చికిత్స శిబిరం ప్రారంభం

రాజంపేట రూరల్: ప్రజలకు సేవలందిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌లో ఆదివారం శంకర నేత్రాలయం, వల్లూరు మాధవీలత-రమేష్‌రెడ్డి ఉచిత కంటిపొర చికిత్స శిబిరం నిర్వహించారు. ముందుగా శిబిరాన్ని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాయచోటి, రాజంపేట ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి, ఆర్‌డీఓ రామకృష్ణారెడ్డిలతో కలిసి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆపరేషన్ నిర్వహించే శంకర నేత్రాలయ బస్సులను వారు ప్రారంభించారు. తర్వాత కంటి పరీక్షలు జరుగుతున్న తీరును పరీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ కంటి పరీక్షలు ఖరీదైపోతున్న నేటి రోజులలో ఆకేపాటి ఉచితంగా వందల మందికి శస్త్రచికిత్సలు చేయించడం అభినందనీయమన్నారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ఆకేపాటికి ఎవరూ సాటి రారని అన్నారు. రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కంటిచూపుతో ఒక జీవితంలో వెలుగు నింపవచ్చన్నారు. ఎమ్మెల్యే మేడా మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను ఏ విధంగా చేయాలో ఆకేపాటిని చూసి నేర్చుకొవాలని కోరారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ కంటి చూపు లేనివారు మన ఉమ్మడి జిల్లాల్లో ఉండకుండా చేసేందుకే విరివిగా ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 3వతేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, మిరియాల సురేఖ, ఇరగమరెడ్డి సుబ్బారెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ అన్నమయ్య మాజీ గవర్నర్ రామలింగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ విభాగాల కన్వీనర్లు, ఎంపీటీలు, సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిగా దాదాపు 100 మంది కంటి ఆపరేషన్‌కు ఎంపికయ్యారు.

ఘనంగా ఎంపీ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుక

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఆధర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాయచోటి, రాజంపేట ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్ రెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

30న తిరువన్నామలైకి ప్రత్యేక బస్సులు



కడప కోటిరెడ్డిసర్కిల్: తమిళనాడు రాష్ట్రంలోని తిరువన్నామలై అరుణాచల గిరి ప్రదక్షిణ నేపధ్యంలో ఈనెల 30వ తేదిన జిల్లాలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల డిపోల నుంచి సర్వీసులు నడుస్తాయన్నారు.

- కడప నుంచి ఉదయం 5.00 గంటలకు (6002) తిరువన్నామలై బయలుదేరుతుందన్నారు.
- పులివెందుల డిపో నుంచి ఉదయం 8.00 గంటలకు (59900) కంచి మీదుగా వెళుతుందన్నారు.
- ప్రొద్దుటూరు డిపోనుంచి రాత్రి 7.45 (98398) సర్వీసు బయలుదేరుతుందన్నారు.
- మైదుకూరు డిపో నుంచి సర్వీసు (96786, 95678)లు ఉదయం 6.30 గంటలకు పోరుమామిళ్లలో, సాయంత్రం 6.00 గంటలకు మైదుకూరు నుంచి బస్సులు బయలుదేరుతుందన్నారు.
- బద్వేలు డిపో నుంచి (9569, 9580, 60009) ఉదయం 5.00, 5.30 గంటలకు పోరుమామిళ్ల నుంచి, 6.00 గంటలకు బద్వేలు నుంచి బస్సులు బయలుదేరుతాయన్నారు. ఈ సర్వీసులు పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా వెళతాయన్నారు.
- జమ్మలమడుగు డిపో నుంచి (98398) రాత్రి 7.00 గంటలకు బయలుదేరి ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా తిరువన్నామలైకు వెళతాయన్నారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో 15 జీవాలు మృతి



మృతి చెందిన మేకలు, గొర్రెలు

లింగాల : మండలంలోని బోనాల గ్రామంలో ఆదివారం ఉదయం గొర్రెల దొడ్డిలోకి ఊర కుక్కలు చొరబడి దాడి చేశాయి. ఈ సంఘటనలో 15 మేకలు, గొర్రెలు మృతి చెందాయి. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు గొర్రెల కాపరులు రామాంజనేయులు, వెంకటస్వామి వాపోయారు.

కారును ఢీకొన్న లారీ

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారిలోని మండల పరిధి మంగపట్నం గ్రామ సమీపంలో కారును లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారులోని ఎయిర్ బెలూన్లు ఓపెన్ కావడంతో ప్రమాదం తప్పింది. తాడిపత్రి వైపు నుంచి కారు కమలాపురం వస్తుండగా.. ఎదురుగా తాడిపత్రి వైపు ప్రయాణిస్తున్న లారీ ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న కమలాపురానికి చెందిన ఓ మహిళకు గాయాలయ్యాయి.

బైక్‌లు ఢీ

మండల పరిధిలోని ఉప్పలూరు గ్రామ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ బైక్‌లు ఢీకొన్నాయి. అంకిరెడ్డిపల్లె నుంచి ఇద్దరు వ్యక్తులు ముద్దనూరుకు వస్తుండగా.. ఎదురుగా వేల్పుచెర్ల నుంచి వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ఘటనలో వేల్పుచెర్లకు చెందిన వరదయ్య కాలికి తీవ్రగాయమైంది. మరో స్కూటరిస్టు అంకిరెడ్డి పల్లెకు చెందిన గంగిరెడ్డికి గాయాలయ్యాయి. 108 వాహనంలో వీరిని ప్రొద్దుటూరుకు తరలించారు.

బస్సు ఢీకొని..

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలం అంబకపల్లె – ముదిగుబ్బ రహదారిలో ద్విచక్ర వాహనంలో వెళ్తున్న మునీంద్రను బస్సు ఢీకొంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని నల్లగొండువారి పల్లె గ్రామానికి చెందిన మునీంద్ర ముదిగుబ్బ మండలంలోని గ్రామానికి డిన్నర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా అంబకపల్లె – ముదిగుబ్బ ఘాట్‌లో ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొంది. దీంతో మునీంద్రకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

బాధ్యత మరచి ఆరోపణలా?

- ఓట్ల తొలగింపుపై టీడీపీ అసంబద్ధ వైఖరి
- కొనసాగుతున్న పునఃపరిశీలన
- ప్రత్యేక అధికారిగా డీసీఓ

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ఓటర్ల తొలగింపుపై ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ గగ్గోలు పెట్టడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఆ పార్టీని టార్గెట్ చేసుకుని లక్షలాది ఓట్లు తొలగించినట్లు, ఎలక్టోరల్ రోల్స్ అన్నీ తప్పుల తడక అన్నట్లుగా ఆ పార్టీ నేతలు మాట్లాడుతుండటం చూసి జనం విస్తుపోతున్నారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో తొలి నుంచి బాధ్యత లేకుండా వ్యవహరించిన ఆ పార్టీకి మరొకరిపై ఆరోపణలు చేసే హక్కు లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏటా కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం జరుగుతుంది. ఈ ప్రక్రియ పారదర్శకంగా జరిగినపుడే వంద శాతం ప్యూరిఫైడ్(శుద్ధి చేసిన) ఓటరు జాబితా రూపొందుతుంది. ఇందుకోసం ప్రతి దశలోనూ జిల్లా ఎన్నికల అధికారి, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహిస్తుంటారు. సమ్మరి రివిజన్(సారాంశ సవరణ)లో భాగంగా జరిగే ఇంటింటి పరిశీలన కార్యక్రమంలో.. ఎలాంటి తప్పొప్పులు జరగడానికి ఆస్కారం లేకుండా ఉండేందుకు, రాజకీయ పార్టీలన్నీ బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని అధికారులు తరచూ కోరుతూ ఉంటారు. ప్రభుత్వం నియమించే బీఎల్‌ఓలతోపాటు బూత్ లెవెల్ ఏజెంట్లు కూడా ఇంటింటి సర్వేలో పాల్గొంటే ఓటర్ల నమోదు, తొలగింపులు, బదిలీ వంటివి పక్కాగా జరుగుతాయి. అపోహలు, విమర్శలకు అవకాశం ఉండదు. జిల్లాలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీజేపీ ఉనికి నామమాత్రమే గనుక జిల్లా అంతటా బీఎల్‌ఏలను నియమించుకునే పరిస్థితి ఆ పార్టీలకు లేదు. ఇక మిగిలిందల్లా ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ. ప్రతి చోట బూత్ లెవల్ కమిటీలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు వంటి నిర్మాణాలు ఆ పార్టీకి ఉన్నాయి. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో కార్యకర్తలు ఉన్నారు. కానీ బీఎల్‌ఏలను నియమించి ఏనాడూ ఇంటింటి సర్వేలో పాల్గొన్న పాపాన పోలేదు. ఈ నాలుగేళ్లు పట్టించుకోని ఆ పార్టీ సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో.. తమ ఓట్లను అన్యాయంగా తొలగించారంటూ బాధ్యత మరిచి ఆరోపణలు చేస్తోంది.

తొలగింపుపై కొనసాగుతున్న పునఃపరిశీలన

జిల్లాలో 94,857 ఓట్లు జాబితాల్లో గల్లంతైనట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది. తొలగించిన మొత్తం ఓట్లలో ఫొటో సిమిలర్ ఎంట్రీలు, డెమోగ్రాఫిక్ సెమిలర్ ఎంట్రీలు 17,240 ఉన్నట్లు సమాచారం. కడప అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 19,940 ఓట్లు తొలగించారు. గతేడాది జనవరి నుంచి ఈనెల 14వ తేదీ వరకు ఈ ఓట్ల తొలగింపు చోటుచేసుకున్నట్లు చెబుతున్నారు. దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు అనుసరించి జిల్లాలో పునః పరిశీలన కార్యక్రమం జరుగుతోంది. ఇందు కోసం ప్రత్యేక అధికారిగా జిల్లా సహకారశాఖ అధికారి సుభాషిణిని నియమించారు. ర్యాండమ్‌గా 500 ఓటర్లను తీసుకుని పరిశీలన చేస్తారు. ఎక్కడైనా అనుమానం వస్తే క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహిస్తారని తెలుస్తోంది. ఈనెల 31వ తేదీ నివేదికను జిల్లా ఎన్నికల అధికారికి సమర్పించనున్నారు.

ఈసీ ఆదేశాలు

ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపుపై అనేక జాగ్రత్తలు పాటించాలంటూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. సిస్టమ్‌లో జనరేట్ అయిన, బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల నివేదికల ప్రకారం మల్టిపుల్ ఫొటో సిమిలర్ ఎంట్రీస్, డెమో గ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్‌ను ఫారం–7 స్వీకరించకుండా, విచారణ నిర్వహించకుండా ఏ ఒక్క ఓటును ఈఆర్‌ఓ తొలగించరాదని ఈసీ ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. ఒక వ్యక్తి ఒకచోటనే ఓటరుగా ఉండాలి. అది ఎక్కడ ఉండాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ వారికే ఉంటుంది. ఆ వ్యక్తి కోరిన చోటున ఓటు ఉంచి మిగతా చోట్ల పేరు ఉంటే వాటిని తొలగించాలి. ఇందుకోసం ఫార్మెట్–ఏ ఆ వ్యక్తికి రిజిస్టర్ పోస్టు లేదా స్పీడ్ పోస్టు ద్వారా జారీ చేయాలి. 15 రోజుల్లో ఆ వ్యక్తి నుంచి సమాధానం రాకపోతే బీఎల్‌ఓ వెళ్లి కన్ఫర్మేషన్ లెటర్ ఆ వ్యక్తి నుంచి స్వీకరించి వెరిఫికేషన్ నిర్వహించాల్సి ఉంటుంది. కొంత మంది ఓటర్లు శాశ్వతంగా ఒక ప్రాంతం నుంచి వేరొక ప్రాంతానికి వలస వెళ్లి ఉంటారు. అలాంటి సమయంలో అందిన ఫిర్యాదుపై ఫార్మెట్–బి రిజిస్టర్ పోస్టు ద్వారా పంపాలి. సంబంధిత చిరునామాలో ఆ వ్యక్తి లేరని పోస్టల్ శాఖ ఆ నోటీసు వాపసు చేయాల్సి ఉంటుంది. గడువులోపు ఆ ఓటరు నుంచి స్పందన లేకపోతే బీఎల్‌ఓతో విచారణ నిర్వహించాలి. బీఎల్‌ఓ కూడా అదే నివేదిక ఇస్తే 15 రోజుల నిర్దేశిత గడువు ముగిశాక ఈఆర్‌ఓ డెలిట్ చేయవచ్చు. తాత్కాలికంగా వలస వెళ్లిన వారి పేర్లు జాబితాలో నుంచి తొలగించకుండా అలాగే ఉంచాలి. మృతి చెందిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి ఫారం–7, బీఎల్‌ఓ నివేదిక ఆధారం చేసుకోవాలి. బీఎల్‌ఓ సమర్పించే తన నివేదికకు మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన డెత్ సర్టిఫికెట్ జత చేయాల్సి ఉంటుంది. ఈఆర్‌ఓ నోటీసు బోర్డులో ప్రదర్శించి ఏడు రోజుల గడువు ఇస్తారు. గడువు ముగిసినా స్పందన లేకపోతే అప్పుడు వారి పేర్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటారు. ఓట్ల తొలగింపు ప్రక్రియకు సంబంధించిన అన్ని పత్రాలను మూడేళ్లు అలాగే ఉంచాలి. ఈఆర్‌ఓ నెట్‌లో కూడా ఈ సమాచారం మూడేళ్లు ఉంచాలని ఎన్నికల సంఘం నిర్దేశించింది. ఇలా డబుల్ ఎంట్రీలు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, వివాహం చేసుకుని వెళ్లిన వారు, మృతి చెందిన ఓటర్లు, షిఫ్టెడ్ ఎలక్టార్స్ జాబితాలో నుంచి తొలగించే సమయంలో ఈసీ మార్గదర్శకాలను పాటించాల్సి ఉంది. అయితే ఈసీ నిర్ణయించిన గడువు సమీపించే కొద్దీ బీఎల్‌ఓలపై అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకు వచ్చారు. పైగా బీఎల్‌ఓ యాప్ సక్రమంగా పనిచేయలేదని ఆరోపణలు ఉన్నాయి. అలాగే యాప్‌లో నమోదు అంశాలపై బీఎల్‌ఓలకు తగిన శిక్షణ కూడా ఇవ్వలేదని చెబుతున్నారు. దీంతో బీఎల్‌ఓలు ఇష్టమొచ్చిన రీతిలో ఓట్లను తొలగించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవాలు ఇలా ఉండగా, విపక్ష నేతలు అధికార పార్టీపై బురదజల్లే విమర్శలకు పాల్పడుతున్నారు.

నియోజకవర్గాల వారీగా గల్లంతైన ఓట్ల వివరాలు

నియోజకవర్గం	తొలగించిన ఓట్లు
బద్వేలు	10,750
కడప	19,940
పులివెందుల	12,986
కమలాపురం	9,403
జమ్మలమడుగు	13,119
ప్రొద్దుటూరు	17,411
మైదుకూరు	11,248

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

బద్వేలు అర్బన్ : బద్వేలు – కడప రహదారిలోని గొడుగునూరు క్రాస్ రోడ్డు వద్ద శనివారం రాత్రి బైక్ అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఆంజనేయనగర్‌లో నివసించే చెంచిరెడ్డి, ఈశ్వరమ్మల కుమారుడైన మాచుపల్లి మనోహర్‌రెడ్డి (29) బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈయనకు రెండేళ్ల క్రితం సుధ అనే యువతితో వివాహమైంది. అయితే శనివారం రాత్రి తన వద్ద పనికి వచ్చిన కూలీలను అట్లూరు మండలం కొండూరులో వదిలేందుకు తన ద్విచక్ర వాహనంలో వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో.. గొడుగునూరు క్రాస్ రోడ్డు వద్దకు వచ్చే సరికి బైక్ అదుపుతప్పి తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే స్థానికులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అందించి కడపకు రెఫర్ చేశారు. కుటుంబ సభ్యులు కడపకు తీసుకెళుతుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఇన్‌చార్జి ఎస్‌ఐ కె.సి.రాజు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



మృతి చెందిన మనోహర్‌రెడ్డి

బాధిత కుటుంబానికి సాయం



నగదు అందజేస్తున్న డిప్యూటీ సీఎం, కువైట్ రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

కడప కార్పొరేషన్ : కువైట్‌లో ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కిందపడి మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడి కుటుంబానికి కువైట్ రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.1.22 లక్షల ఆర్థిక సాయం చేశారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని ఆదివారం స్థానిక నూర్ ఏ జహాన్ కల్యాణ మండపంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా చేతుల మీదుగా ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గం అట్లూరు మండలం బొడిచెట్టిపల్లెకు చెందిన పొన్నపోలు నరసారెడ్డి జీవనోపాధి నిమిత్తం కువైట్ వెళ్లి భవన నిర్మాణ పనులు చేస్తుండగా.. ఈ ఏడాది జూన్ 27న మూడో అంతస్తు నుంచి కిందపడి మరణించారన్నారు. రెడ్డీస్ సంఘం సభ్యుడు గజ్జల నరసారెడ్డి కమిటీ దృష్టికి తీసుకురావడంతో అందరూ కలిసి ఈ ఆర్థిక సాయం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ ఎం.బాలిరెడ్డి, కో కన్వీనర్ ఎంవీ నరసారెడ్డి, రెడ్డీస్ అసోసియేషన్ కువైట్ ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, అరవ సుబ్బారెడ్డి, సలహాదారు గజ్జల నరసారెడ్డి, మాజీ అధ్యక్షులు వీపీ రామచంద్రారెడ్డి, పి.సురేష్‌రెడ్డి, హనుమంతురెడ్డి, జి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కార్డన్ సెర్చ్ ఆపరేషన్

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిల్లో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలో కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి ఎర్రముక్కపల్లిలోని పూసల వీధి, కందిపాలెం పరిసరాల్లో ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి అనుమానిత వ్యక్తుల ఇళ్లలో క్షుణ్ణంగా పరిశీలించారు.

వ్యక్తిని గొంతు కోసి హత్య



హత్యకు గురైన కృష్ణారెడ్డి

చిట్వేలి : మండల పరిధిలోని కేఎస్ అగ్రహారంలో బిక్కిరెడ్డి మునికృష్ణారెడ్డి(42)ని ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు గొంతు కోసి హత్య చేశారు. గ్రామంలో వివాద రహితుడిగా, మంచి వ్యక్తిగా పేరున్న కృష్ణారెడ్డిని స్థానిక ఈశ్వరీదేవి ఆశ్రమం (రంగయ్యస్వామి మఠం) సమీపంలో హత్య చేసి పడేశారు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో వ్యక్తి పడిపోయి ఉండటాన్ని గుర్తించిన కొందరు దగ్గరకు వెళ్లి చూడగా.. కృష్ణారెడ్డి అని నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న రైల్వేకోడూరు సీఐ మధుసూదన్‌రెడ్డి, ఓబులవారిపల్లె ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి, చిట్వేలి ఏఎస్‌ఐ వెంగయ్య సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అలాగే డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లు పరిశీలించాయి. రక్త నమూనాలను సేకరించినట్లు పోలీసులు తెలిపారు. కృష్ణారెడ్డికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ హత్య అటు గ్రామస్తులకు, ఇటు పోలీసులకు మిస్టరీగా మిగిలిపోయింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఖైదీకి అవార్డు, ప్రశంసాపత్రం



ఖైదీ శ్రీకాంత్‌గౌడ్‌కు వచ్చిన అవార్డు



అవార్డు, ప్రశంసాపత్రం అందజేస్తున్న అంబేడ్కర్ యూనివర్సిటీ అధికారులు

కడప అర్బన్ : హత్య కేసులో 24 ఏళ్లపాటు జీవిత ఖైదు అనుభవిస్తున్న టి.శ్రీకాంత్ గౌడ్‌కు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ సీతారామన్ అవార్డుతోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. తిరుపతి జిల్లా గూడూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన శ్రీకాంత్‌గౌడ్ 24 ఏళ్ల కిందట ఓ హత్య కేసులో కడప కేంద్రకారాగారానికి జీవిత ఖైదుగా వచ్చాడు. రాజమండ్రి జైల్లో వున్నపుడు అంబేడ్కర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా డిగ్రీ పూర్తి చేశారు. కడప కేంద్ర కారాగారానికి వచ్చాక ఎం.ఏ సోసియాలజీ పూర్తి చేశారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా.. నాలుగు నెలల క్రితం రాష్ట్రంలోని అన్ని జైళ్లలో వున్న ఖైదీలకు 'డాక్టర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ విత్ మై లైఫ్' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా కడప కేంద్ర కారాగారంలో నిర్వహించిన పోటీల్లో శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జైళ్లలో వున్న 44 మంది ఖైదీలు పోటీల్లో పాల్గొన్నారు. శ్రీకాంత్ గౌడ్ రాసిన వ్యాసానికి స్పెషల్ కేటగిరిలో మొదటి బహుమతి వచ్చింది. శనివారం హైదరాబాద్‌లోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ సీతారామన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికను అందజేశారు. ప్రస్తుతం శ్రీకాంత్ గౌడ్ నెల్లూరు జిల్లాలో కేంద్ర కారాగారంలో వున్నారు. 24 ఏళ్లుగా జైలులో వున్నాననీ, ఈ అవార్డు రావడంతో చాలా సంతోషంగా వున్నానని, తనకు విముక్తి కల్పించాలన్నారు.

ఊరి ప్రజల కోసం ఎంతో సేవ చేసిన 'పాణ్యం'

- కాంస్య విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే రాచమల్లు
- హాజరైన ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే నాని

ప్రొద్దుటూరు : ఈ ఊరి ప్రజల కోసం నాడు పాణ్యం యర్రమునిరెడ్డి ఎంతో సేవ చేశారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మూడు మార్లు మున్సిపల్ చైర్మన్‌గా, ఓ మారు ఎమ్మెల్యేగా ఉన్న ఆయన ఊరి అభివృద్ధి కోసం అన్ని విధాలా కృషి చేశారన్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీ ఎంట్రన్స్ వద్ద ఏర్పాటు చేసిన పాణ్యం యర్రమునిరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ మన ఊరి ప్రజల కోసం చేసిన సేవలకు గుర్తుగా ఆయనను స్మరించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పాణ్యం కుటుంబ సభ్యుల సహకారంతో విగ్రహావిష్కరణ కార్యక్రమం, మున్సిపల్ నిధులతో రోడ్డు విస్తరణ, డివైడర్‌ను నిర్మించి వైఎంఆర్ కాలనీ ఎంట్రన్స్‌ను సుందరంగా తీర్చిదిద్దామని అన్నారు. పాణ్యం హయాంలోనే ఇక్కడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఇండస్ట్రియల్ ఎస్టేట్ మంజూరైందని, సెయింట్‌జోసెఫ్ స్కూల్‌కు 2.70 ఎకరాల స్థలాన్ని ఉచితంగా ఇచ్చారన్నారు. నేడు ఆ స్థలం విలువ రూ.100 కోట్లు అవుతుందని తెలిపారు. ఆర్యవైశ్యులను ఒప్పించి డీఏడబ్ల్యూ కళాశాలను ఏర్పాటు చేశారని తెలిపారు. వైఎంఆర్ కాలనీ ఆయనే ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఇంతటి గొప్ప నాయకుడి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ప్రతిపక్ష పార్టీలు అడ్డుకోవాలని చూడటం ఏమిటని ప్రశ్నించారు. మొదటి నుంచి వైఎంఆర్ కాలనీ వద్ద పాణ్యం యర్రమునిరెడ్డి కాలనీ బోర్డు, విగ్రహం ఉండేదన్నారు. దాని స్థానంలో ప్రస్తుతం కొత్తది నిర్మించడం జరిగిందన్నారు. అన్ని అనుమతులు తీసుకుని ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

■ ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ పాణ్యం యర్రమునిరెడ్డి ఆనాడే పట్టణాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసి అభివృద్ధికి పూనుకున్నారన్నారు. నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య లాంటి ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకుని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి (నాని) పాణ్యం యర్రమునిరెడ్డి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. బ్రిటీష్ హయాంలోనే పట్టణాభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, విగ్రహావిష్కరణ కార్యక్రమ నిర్వాహకులు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీఈఏ మెంబర్ కాకర్ల నాగేశ్వారెడ్డి, పెద్దిరెడ్డి శౌరి సుభాష్‌రెడ్డి, పాణ్యం యర్రమునిరెడ్డి కుటుంబ సభ్యులు, డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, ఆల్ ఇండియా రేడియో స్టేషన్ మాజీ డైరెక్టర్ విజయసారథి, కాంట్రాక్టర్లు బద్వేలి ప్రభాకర్‌రెడ్డి, గుర్రప్ప పాల్గొన్నారు.



పాణ్యం యర్రమునిరెడ్డి విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాదరెడ్డి, గంగుల బిజేంద్రరెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

వ్యక్తి ఆత్మహత్య

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామానికి చెందిన మావు చెన్నుగాళ్ల ఆంజనేయులు (50) ఆదివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రాజగోపాల్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆంజనేయులు గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో కడుపు నొప్పి తాళలేక, జీవితంపై విరక్తి చెంది ఎస్సీ కాలనీలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి చెన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

చిరుత సంచరిస్తోందని గ్రామస్తుల ఆందోళన



చిరుత పులి పాదముద్రలా ఉన్న గుర్తు



అడుగులను చూస్తున్న ఏఎస్‌ఐ, పోలీసులు, రైతులు

రాజుపాళెం : మండల పరిధి వెంగళాయపల్లె దగ్గరలోని దద్దనాలకు వెళ్లే రహదారి పక్కన పంట పొలాల్లో చిరుతపులి సంచరిస్తోందని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. చిరుతపులి, వాటి పిల్లలు సంచరించినట్లు పాదముద్రలు కనిపించడంతో.. ఆదివారం సాయంత్రం వాటిని చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో వెళ్లారు. గ్రామ సమీపంలో జగన్నాథరెడ్డి మొక్కజొన్న పంటను సాగు చేశాడు. ఆ పంట పొలంలో చిరుత పిల్లలు కనపడినట్లు తెలియజేయడంతో.. ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ ఆ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అలాగే పాదముద్రలకు సంబంధించిన ఫొటోలను ఫారెస్టు అధికారులకు పంపించారు. అయితే ఇది కొండ ప్రాంతం కాకపోవడంతో.. చిరుత పులులు ఎలా వస్తాయని గ్రామస్తుల్లో మరొక అనుమానం నెలకొంది. ఫారెస్టు అధికారులు ఆ గుర్తులు పరిశీలించి చిరుత పులులు ఉన్నాయా లేదా అన్న సమాచారం తెలపాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

పూచి పడిన డబ్బు ఎలా తీర్చాలి!

ఆందోళనతో సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య



వినోద్‌కుమార్ మృతదేహం

జమ్మలమడుగు రూరల్ : బ్యాంక్‌లో పూచి పడిన డబ్బు ఎలా తీర్చాలనే ఆందోళనతో ఓ సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జమ్మలమడుగు పట్టణంలోని బెల్లాలవారి వీధిలో చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బద్వేలు నియోజకవర్గంలోని రెడ్డిపల్లె గ్రామానికి చెందిన జంగిటి వినోద్‌కుమార్(27) కొంత కాలం నుంచి పెద్దముడియం మండలంలోని కొండసుంకేసుల గ్రామం సచివాలయంలో సహాయ వ్యవసాయాధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. కొంత కాలం క్రితం మైలవరం మండలం కర్మలవారిపల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి బ్యాంక్‌లో పూచి పడి రూ.10 లక్షలు ఇప్పించాడు. తీసుకున్న వ్యక్తి చెల్లించలేదు. దీంతో బ్యాంక్ అధికారులు వినోద్‌కుమార్ జీతం నుంచి తీసుకోవడం జరుగుతోంది. ఇలా ఎన్ని నెలలు చెల్లించాలని ఆందోళన చెందాడు. ఆదివారం రాత్రి ఇంట్లో భార్య ఓ గదిలో ఉండగా.. మరో గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంత సేపటికీ భర్త రూం నుంచి బయటకు రాకపోవడంతో భార్య సౌజన్య తలుపులు తీసి చూడగా.. ఫ్యాన్‌కు వేలాడుతున్నాడు. స్థానికుల సాయంతో కిందికి దింపి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. వినోద్‌కుమార్‌కు ఒక సంవత్సరం కూతురు ఉంది. సంఘటన విషయమై పోలీస్‌లను వివరణ కోరగా.. పూర్తి వివరాలు తెలియవలసి ఉందని, విచారణ చేస్తున్నామన్నారు.

ట్రాక్టర్ ఢీకొని గర్భిణి దుర్మరణం



గంగాదేవి మృతదేహం వద్ద రోదిస్తున్న సంబంధీకులు

పెండ్లిమర్రి : మండలంలోని బుద్దాయపల్లె గ్రామ సమీపంలో ఆదివారం ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో గర్భిణి దుర్మరణం చెందింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... బుద్దాయపల్లె గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, సొల్లు గంగాదేవి(25), కుమార్తె సుశి కలిసి ద్విచక్ర వాహనంలో వైద్యం కోసం కడప ఆసుపత్రికి వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామ సమీపంలో ట్రాక్టర్ డ్రైవర్ అదుపు తప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ద్విచక్ర వాహనంలో వెళుతున్న వారు కింద పడ్డారు. గంగాదేవి తలపై ట్రాక్టర్ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుబ్బరాయుడు, కుమార్తె సుశికి గాయాలు అయ్యాయి. వారిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.